పేదలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

- ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు
- ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన



పెదపాలపర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్



మల్లాయపాలెంలో శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీపీ పుష్పరాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు

ముదినేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఎంతో రక్షణగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెదపాలపర్రు పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఆరోగ్య పరంగా రక్షణ కల్పించి ఆర్థికభారం తగ్గించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఇందుకు అనుగుణంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య సేవలందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యపరంగా రక్షణ పొందాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. గ్రామంలో రూ.18.50 లక్షల వ్యయంతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ప్రజలు అనేక అవస్థలు పడ్డారన్నారు. వీటిని గుర్తించి ప్రాధాన్యంవారీగా గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక చిన రామాలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపీటీసీ సభ్యురాలు మేడేపల్లి నాగదుర్గ, సొసైటీ అధ్యక్షుడు బొప్పన ప్రసాద్, నాయకులు మోత్రు ఏసుబాబు, సోమా సత్యనారాయణ, అల్లాభక్షు, మెరుగుమాల వెంకటేశ్వరరావు, రమేష్, చల్లగుల్ల శ్రీకాంత్, గంటా కోటేశ్వరరావు, ఈడే వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే సీఎం లక్ష్యం

కైకలూరు: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. మండలంలోని తామరకొల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్‌లు భత్రాజు శివాజీ, ఉలిసి వసంతకుమారి, జయమంగళ కాసులు, ఉలిసి సత్యనారాయణ, బీసీ నాయకులు చేబోయిన వీర్రాజు, ఉప సర్పంచ్ చిట్టేటి హేమ, పీఏసీఎస్ అధ్యక్షుడు కుర్మా నెహెమియా, ఆర్బీకే చైర్మన్ గంగుల రాజేంద్రప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



గుడివాడలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ప్రజలకు ఉచిత వైద్య సేవలు

గుడివాడరూరల్: పేదలకు గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎంపీపీ గద్దె పుష్పరాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాయపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వైద్యశిబిరంలో ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి 118 రకాల మందులను అందజేశారు. పేద ప్రజలకు గ్రామాల్లోనే కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో 490 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశామని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, నాయకులు మురారి నగేష్, పొడిచేటి కృష్ణ, అబ్దుల్ తాజుద్దీన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ షాకీర్(ఉస్మాన్), షేక్ గులాబ్, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో 781 మందికి వైద్య పరీక్షలు

గుడివాడటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం 8వ వార్డు పెద్దవీధి సంఘం మున్సిపల్ పాఠశాలలో 5, 6, 8 వార్డుల సచివాలయ పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో సుగర్, బీపీ, రక్త పరీక్షలు, గుండె, కంటి పరీక్షలు నిర్వహించారు. పురుషులు 335, మహిళలు 446, మొత్తం 781 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి, డాక్టర్ జయప్రద, డాక్టర్ సురేష్, హెల్త్ సెక్రటరీ వెంకటలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ 5వ వార్డు ఇన్‌చార్జ్ వెంపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం అప్పుల పాలుకాకూడదు



గుర్వాయిపాలెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: వైద్యం కోసం పేదవాళ్లు అప్పుల పాలుకాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేయడంతో పేదలు వైద్యం కోసం అప్పులు చేయకుండానే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారుతున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు. మండలంలో గుర్వాయిపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. వైద్య శిబిరంలో మొత్తం 420 మందికి సేవలు అందినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, సీనియర్ నాయకులు కొల్లాటి సత్యనారాయణ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, సర్పంచ్‌లు బత్తిన ఉమామహేశ్వరరావు, అనపర్తి వర్ధీకాసులు, ఎంపీటీసీలు గోదావరి సత్యనారాయణ, ఇమ్మానేని లక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, ఉప సర్పంచ్ నల్లూరి మహాలక్ష్మి, రేవు నరసింహారావు, బత్తిన మహాలక్ష్మి, వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు చాన్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగాలకు 54 మంది ఎంపిక



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో కోయాక్స్ డెవలప్‌మెంట్ టెక్నాలజీస్ మల్టీ నేషనల్ కంపెనీ, టైడల్ పార్క్ చెన్నై ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ ఎంపికలో 54 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధి ఎం.ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను గురువారం అందజేశారు. కళాశాలలో ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా 54 మంది ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాదికి రూ.5 లక్షలు వేతనం ఇస్తామని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.నవీన్‌కుమార్ అభినందించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



మండవల్లి: మండల పరిధిలోని లింగాల హైస్కూల్‌లో పదో తరగతి చదివి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఫ్రీ సీటు సాధించి మొదటి సంవత్సరం చదువుతున్న మకరం లక్ష్మినాగసురేంద్రనాయుడు అనే విద్యార్థికి సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్ కుమార్ రూ.10 వేల నగదును భాస్కరరావు భైరవపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు మాట్లాడుతూ సుధామ ఫౌండేషన్ సైన్స్‌పై అవగాహన కలిగించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్.సిద్ధార్థ, ఎం.అజిత్, సుధామ ఫౌండేషన్, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయల విక్రయం



ముదినేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సిబ్బంది గురువారం విక్రయించారు. మండలంలోని బొమ్మినంపాడు, కొరగుంటపాలెం గ్రామాల్లో ప్రకృతి సేద్యంతో కూరలను పండించారు. వీటికి తోడు గిరిజన కార్పొరేషన్ నుంచి బెల్లం, పసుపు స్థానికంగా కొనుగోలు చేసి కూరలతో పాటు విక్రయాలు చేపట్టారు. వీటికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. మాములు కూరల ధరలతో పోలిస్తే వీటి ధర కొంత ఎక్కువైనప్పటికీ ప్రజలు మంచి ఆదరణ చూపుతున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం



పామర్రు: స్థానిక కొత్త పేటలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నందిపాటి సాంబిరెడ్డి తండ్రి నందిపాటి వెంకటరెడ్డి(90) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈనేపథ్యంలో గురువారం సాంబిరెడ్డిని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధైర్య పడవద్దని, పార్టీ మీకు అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు మోరా వెంకటరెడ్డి, చాగంటి గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు.

చెడుగుడు పోటీలు ప్రారంభం



కైకలూరు: క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని టౌన్ సీఐ ఆకుల రఘు అన్నారు. వేమవరప్పాడులో రోమన్ కాథలిక్ మిషన్(ఆర్సీఎం) క్రైస్తవ సంస్థ లయోలా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను సీఐ గురువారం ప్రారంభించారు. ఆటల పోటీలు మంగళవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కోరుకొల్లు విచారణకర్తలు ఫాదర్ గూడపాటి ప్రతాప్‌కుమార్, స్పీడ్ సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేరా రమేష్‌బాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్ బాబు సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మహిళలు, పిల్లలపై లైంగిక దాడులు–సమాజం పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు గురువారం జరిగాయి. విజేతలకు సీఐ కిషోర్‌బాబు బహుమతులను అందజేశారు. ఎస్ఐ పి.విశ్వనాథ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

పులిగడ్డ(అవనిగడ్డ): ఉద్యాన పంటలకు ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా లాభాలు గడించవచ్చని ఉద్యానవన శాఖాధికారి రమేష్ అన్నారు. పులిగడ్డలో ఉద్యాన శాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ కొబ్బరి, ఆయిల్‌పాం తోటల పెంపకంలో ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను వివరించారు. పలు పంటల్లో యాజమాన్య పద్ధతులను తెలిపారు. సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, సచివాలయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లిరూరల్: ముదినేపల్లిలో తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని శ్రీకనకదుర్గ ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన జరిగింది. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో 2 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, నాయకులు జాస్తి చంటి, సాక్షి సాయిబాబు, దివి సతీష్, పేర్ని పృథ్వీ, లేళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో..

మండవల్లి: మండవల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా గురువారం రాత్రి భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు. సమీప గ్రామాలైన గన్నవరం, అయ్యవారిరుద్రవరం, పెరికెగూడెం, కొర్లపాడులకు చెందిన 2,500 మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు



భజన బృందం సభ్యులు, నిర్వాహకులు

గుడివాడటౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో వేం చేసి ఉన్న శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో దేవస్థానం ట్రస్ట్, తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో భజన కార్యక్రమం గురువారం జరిగింది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆశ్వయుజ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మాతృశ్రీ భజన మండలి ఆధ్వర్యంలో భజనా కార్యక్రమం చేపట్టారు. అనంతరం రామాయణంపై వేద పండితులు బాల సుబ్రహ్మణ్యం ఉపన్యసించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి కావూరి శ్రీధర్, ఆలయ అధ్యక్షురాలు గుదే లక్ష్మీ రంగనాయకమ్మ, కోశాధికారి మాదాసు వెంకట లక్ష్మీకుమారి, ప్రధాన అర్చకుడు వి.రామ కృష్ణామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో సాగుదారుల తుది జాబితా ప్రదర్శన



జాబితా ప్రదర్శిస్తున్న ఏడీఏ గంగాధరరావు

కైకలూరు: రైతుల ఈ–క్రాప్ ఈకేవైసీ వివరాలకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో తుది జాబితాను గురువారం ప్రదర్శించామని వ్యవసాయశాఖ ఏడీఏ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఆదివారం వరకు ఆర్బీకేల్లో, గ్రామ సభల్లో ఈ క్రాప్ జాబితాను సామాజిక తనిఖీలకు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు తమ వివరాలు సరి చూసుకుని ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ఏవో ఆర్.దివ్య, రైతులు పాల్గొన్నారు.

ఈ – క్రాప్ వివరాలు సరిచూసుకోండి

ముదినేపల్లిరూరల్: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి నమోదు చేసిన ఈ–క్రాప్ వివరాలను రైతులు సరిచూసుకోవాలని వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ కోరారు. కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 27 నుంచి 29 వరకు ఈ–క్రాప్ ముసాయిదా జాబితాలను సామూహిక తనిఖీ కొరకు ప్రదర్శించి గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. ముసాయిదా జాబితాలు పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరణ కొరకు రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి రాతపూర్వకంగా అభ్యంతరాలు తెలియజేయాలన్నారు.

పంట నమోదు తుది జాబితా విడుదల

కలిదిండి: పంట నమోదు తుది జాబితాను మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించటం జరిగిందని వ్యవసాయాధికారి కె.విద్యాసాగర్ గురువారం తెలిపారు. నేడు మండలంలోని వరి సాగు చేసే గ్రామాల్లో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. గ్రామసభలో పంట నమోదు తుది జాబితాలోని తప్పులు ఉన్నట్లయితే రైతులు అర్జీల ద్వారా సరి చేసుకోవాలని ఆయన సూచించారు.

మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు



ఆలయంలో పనులను పరిశీలిస్తున్న ఈవో మాధవీలత, ధర్మకర్తల మండలి సభ్యులు



రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన అన్నదాన మండపం

- ఆలయంలో రూ.65 లక్షలతో అభివృద్ధి పనులు
- ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి పర్యవేక్షణ

పమిడిముక్కల: కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన సొబగులద్దుకొంది. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయ ప్రాంగణంలో దాతల భాగస్వామ్యంతో సకల మౌలిక వసతుల కల్పన జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా నిధులు సద్వినియోగమయ్యేలా దేవదాయశాఖ ఈవో మాధవీలత, ధర్మకర్తలమండలి పర్యవేక్షించారు. అభివృద్ధి పనులతో ఆలయం శోభాయమానంగా తీర్చిదిద్దబడింది. ఆలయంలో అన్నదాన మండపం లేక భక్తులు ఇబ్బందులు పడేవారు. ఉయ్యూరుకు చెందిన దాత వూర మోహనరావు రూ.40 లక్షలతో అన్నదాన మండపాన్ని నిర్మించి ఇచ్చారు. ఈ మండపంలో ప్రతి శనివారం భక్తుల సహకారంతో అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణం..

సరైన రహదారి సౌకర్యం లేక ఆలయానికి వచ్చే భక్తులు ఇక్కట్లు పడేవారు. రోడ్డు పల్లంలో ఉండటంతో వర్షం పడితే నీరు నిలిచేది. వాహనదారులు అవస్థలు పడేవారు. సాయిన హోమ్స్ అధినేత సాయిన హేమంత్ రూ.5 లక్షల వ్యయంతో ఆర్చి నుంచి గోశాల వరకు సీసీ రోడ్డు నిర్మించారు. గతంలో కార్యాలయం ఇరుకు గదిలో కొనసాగేది. ఆలయ నిధులు రూ.3 లక్షలు, ఉయ్యూరు విశ్వశాంతి విద్యాసంస్థల అధిపతి మాదల సుబ్రమణ్యేశ్వరరావు అందజేసిన రూ.7 లక్షలు కలిసి కార్యాలయ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మరో రూ.10 లక్షలతో ఆలయంలో మరుగుదొడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టారు. పనులను ఆలయ ఈవో మాధవీలత, ధర్మకర్తల మండలి సభ్యులు కోడెబోయిన కోటేశ్వరరావు, ధూళిపూడి వీరకోటేశ్వరరావు, చీర్ల శ్రీనివాసరావు, ఉమ్మిడిశెట్టి శ్రీలక్ష్మి, పండలనేని రామజ్యోత్స్న, దారపు ఎరుకమ్మ, కాశి నాగేశ్వరమ్మ, బాలిగ లావణ్య, రామానుజాచార్యులు పర్యవేక్షించారు. దాతల సమకారంతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టామని ఈవో మాధవీలత తెలిపారు. యాగశాల, గోశాల పునఃనిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని కోరారు.

3న ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష

డీవైఈఓ సుబ్బారావు



మాట్లాడుతున్న డీవైఈఓ సుబ్బారావు

మచిలీపట్నంటౌన్: స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నవంబరు 3వ తేదీన ఇన్వెస్టిగేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని మచిలీపట్నం డివిజన్ విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు సూచించారు. స్థానిక జార్జికార్నేషనల్ హైస్కూల్‌లో గురువారం ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహణపై ఇన్వెస్టిగేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన పెనుమార్పులతో విద్యాప్రమాణాలు పెరిగాయన్నారు. గతానికి, ఇప్పటికీ విద్యారంగంలో ఎంతో మార్పులు వచ్చాయని చెప్పారు. ఈ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు చదువులో ఎంతమేర రాణిస్తున్నారనే అంశాన్ని తెలుసుకునేందుకు నవంబరు 3వ తేదీన 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యారంగంలో వచ్చిన మార్పులతో విద్యార్థులు చదువులో ఎంతమేర అభివృద్ధి సాధించారో తెలుస్తుందని చెప్పారు. మచిలీపట్నం డివిజన్‌లోని 12 మండలాల్లో 442 సెంటర్లలో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. బందరు ఎంఈఓ దుర్గాప్రసాద్, పలు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కోనేరుసెంటర్: గుర్తుతెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలో గొలుసు తెంపుకుపోయాడు. సీఐ సీహెచ్ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం నరసింహనగర్‌కు చెందిన వృద్ధురాలు మాఘపు నాగవేణి గురువారం తెల్లవారుజామున పూజకు పూలు తెచ్చుకునేందుకు రోడ్డుపై వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని మూడు కాసుల బంగారు గొలుసును తెంపుకు పోయాడు. బాధితురాలు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సతీష్ కుమార్ ఘటనా స్థలంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.